సాక్షి హనుమకొండ

మంగళవారం | 23 | జూలై | 2024



గంజాయిపై ఉక్కుపాదం మోపాలి

గంజాయి రవాణా, విక్రయదారులపై ఉక్కుపాదం మోపాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పోలీస్ అధికారులను ఆదేశించారు. - 8లో▸



తెలంగాణ అంటేనే దాశరథి

తెలంగాణ అంటేనే దాశరథి.. దాశరథి అంటేనే తెలంగాణ అని పలువురు వక్తలు అన్నారు. సోమవారం ఆయన శతజయంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$28^0/24^0$

వాతావరణం

జిల్లాలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అల్పపీడనం ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా చిరుజల్లులు కురుస్తాయి.

న్యూస్‌రీల్

విద్యార్థులు ప్రశ్నించేతత్వాన్ని పెంపొందించుకోవాలి



కాజీపేట అర్బన్ : విద్యార్థులు ప్రశ్నించేతత్వాన్ని పెంపొందించుకుంటేనే ప్రతీఅంశంపై పట్టు సాధించే అవకాశం ఉంటుందని నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ తెలిపారు. నిట్ వరంగల్‌లోని సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ ఇంక్యూబేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన రెండు రోజుల ఇన్‌స్పైర్ మనక్ విద్యార్థుల మెంటర్‌షిప్ కార్యక్రమాన్ని బిద్యాధర్ సుబుదీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆవిష్కరణలకు వేదికగా నిలుస్తున్న సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ ఇంక్యూబేషన్‌లో వివిధ రకాల పరిశోధనలపై అవగాహనతో పాటు సందేహాలను నివృత్తి చేసుకుని పోటీల్లో విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. డీన్ ఆర్‌అండ్‌డీ, ప్రొఫెసర్ సోమశేఖర్, ప్రొఫెసర్లు రవికుమార్, సంపత్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీఎంహెచ్ ఆర్‌ఎంఓగా అంబరీష్ బాధ్యతల స్వీకరణ



హన్మకొండ చౌరస్తా: హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి (జీఎంహెచ్) ఆర్‌ఎంఓగా డాక్టర్ అంబాల అంబరీష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మహబూబాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓగా విధులు నిర్వహిస్తున్న అంబరీష్ జీఎంహెచ్‌కు బదిలీ అయ్యారు. ఇప్పటివరకు ఇక్కడ ఆర్‌ఎంఓగా ఉన్న డాక్టర్ సారంగం మహబూబాబాద్‌కు బదిలీపై వెళ్లారు. పేదలకు మెరుగైన వైద్యం అందేలా కృషి చేస్తానని అంబరీష్ చెప్పారు. కాగా, డాక్టర్ అంబరీష్ వచ్చే ఏడాది జూలైలో పదవీ విరమణ పొందనున్నారు.

మెడికల్ అలవెన్స్‌కు గ్రీన్‌సిగ్నల్

కాజీపేట రూరల్ : రైల్వే సెకండరీ ఫ్యామిలీ పెన్షనర్స్‌కు (రైల్వే డిపెండెంట్లు) వైద్య సదుపాయాలు కల్పించేందుకు రైల్వే బోర్డు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ డివిజన్ సెక్రటరీ రవీందర్ సోమవారం తెలిపారు. సెకండరీ ఫ్యామిలీ పెన్షనర్లకు రైల్వే కార్మికులకు వర్తించే మెడికల్ అలవెన్స్ వర్తింపజేయాలని రైల్వే జీఎం, రైల్వే బోర్డు పీఎన్ఎం సమావేశంలో ఏఐఆర్‌ఎఫ్, ఎస్సీఆర్‌ఎంయూ పక్షాన ఏజీఎస్ ఉదయ్ భాస్కర్, జనరల్ సెక్రటరీ సీహెచ్.శంకర్‌రావు ప్రస్తావించగా రైల్వే బోర్డు అనుమతినిచ్చిందని పేర్కొన్నారు. దీంతో సికింద్రాబాద్ డివిజన్‌తో పాటు కాజీపేట, వరంగల్ సెక్షన్‌లో సుమారు 2,000 మంది సెకండరీ ఫ్యామిలీ పెన్షనర్లు వైద్యసదుపాయాలు పొందనున్నట్లు తెలిపారు.

ఆర్టీసీలో ఇద్దరిపై వేటు

హన్మకొండ : అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలపై విచారించిన ఆర్టీసీ యాజమాన్యం ఇద్దరిపై వేటు వేసింది. టీజీఎస్ ఆర్టీసీ వరంగల్ రీజియన్ అకౌంట్స్ ఆఫీసర్‌గా పనిచేస్తూ ప్రస్తుతం సెలవులో ఉన్న లావణ్యతోపాటు రంగారెడ్డి రీజియన్ అకౌంట్స్ ఆఫీసర్, గతంలో వరంగల్ రీజియన్ అకౌంట్స్ విభాగంలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేసిన రామ్మోహన్‌ను సస్పెండ్ చేశారు. సోమవారం కరీంనగర్ జోన్ ఈడీ ఉత్తర్వులు జారీ చేశారు. 'ఆర్టీసీ అధికారి చేతివాటం', 'సాక్ష్యం చెప్పొద్దు' శీర్షికలతో సాక్షిలో మార్చి 24, 31 తేదీల్లో ప్రచురితమైన కథనాలకు స్పందించిన విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టి నివేదికను యాజమాన్యానికి అందించారు. దీంతో పూర్తిస్థాయి విచారణకు ఆదేశించిన యాజమాన్యం సీనియర్ అకౌంట్స్ అధికారితో కమిటీ వేసింది. ఈ కమిటీ విచారణ చేపట్టి నివేదికను కరీంనగర్ జోన్ ఈడీకి అందజేసింది. నివేదికను పరిశీలించిన ఈడీ ఇద్దరిని సస్పెండ్ చేశారు.

రుణమాఫీ సందేహాలకు హెల్ప్‌డెస్క్

హసన్‌పర్తి : రైతు రుణమాఫీ సందేహాల నివృత్తికి జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడతగా రైతులకు రూ.లక్ష రుణమాఫీ చేయగా కొంతమందికి రుణమాఫీ కాలేదు. దీంతో అన్నదాతల సందేహాల నివృత్తి కోసం ప్రత్యేక కౌంటర్లు సిద్ధం చేశారు.

కంప్యూటర్ ఆపరేటర్ల నియామకం

హెల్ప్‌డెస్క్‌ల్లో ప్రత్యేక కంప్యూటర్ ఆపరేటర్లను నియమించారు. ఈ ఆపరేటర్లు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వ్యవసాయాధికారి కార్యాలయంలో అందుబాటులో ఉంటారు. రుణ మాఫీ అయిన వారి జాబితాను మండల ఏఓ వద్ద ప్రదర్శించారు. కాగా మొదటి విడతలో రూ.లక్ష రుణం పొందిన వారికి మాఫీ అయినట్లు మెసేజ్ రాని పక్షంలో వారు ప్రత్యేక కౌంటర్ల వద్దకు వచ్చి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. సాంకేతిక కారణాలతో రుణమాఫీ అయిన జాబితాల్లో పేర్లు రాలేదని అధికారులు పేర్కొంటున్నారు.

ఓరుఘల్లుమనేనా..!?

నేడు కేంద్ర బడ్జెట్.. ఆశగా ఎదురుచూపు..

- లోక్‌సభ ఎన్నికల్లో ఓరుగల్లుపై హామీల జల్లు
- పోటీపడిన అధికార, ప్రతిపక్ష పార్టీలు.. ఈ బడ్జెట్‌లోనైనా వాటా దక్కేనా?
- మరోసారి ప్రతిపాదనలు ఇచ్చిన ఉమ్మడి జిల్లా ఎంపీలు
- కాజీపేట కేంద్రంగా ఎన్నో రైల్వేలైన్లు.. ప్రతిపాదనలకే పరిమితం...
- స్మార్ట్ సిటీ, హృదయ్ పథకాలకు గత బడ్జెట్‌లో దక్కని ప్రాధాన్యం...
- బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, మేడారం జాతరకు జాతీయ హోదాపై ఆశలు



సాక్షిప్రతినిధి, వరంగల్ :

లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఓరుగల్లు టార్గెట్‌గా బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు హోరాహోరీగా ప్రచారం సాగించాయి. ప్రధానంగా జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌లు తెలంగాణకు రెండో అతి పెద్ద నగరం వరంగల్‌పైనే దృష్టి పెట్టాయి. ఉమ్మడి ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలను ప్రభావితం చేసేందుకు కూడా ఓరుగల్లునే సెంటర్ పాయింట్ చేసుకుని ఉధృతంగా ప్రచారం సాగించాయి. ఈ సందర్భంగా నేతలు పోటాపోటీగా హామీల జల్లు కురిపించాయి. ఆ ఎన్నికల్లో అత్యధిక స్థానాలను కైవసం చేసుకుని మూడోసారి కేంద్రంలో అధికారం చేపట్టిన బీజేపీ.. మంగళవారం లోక్‌సభలో బడ్జెట్ ప్రవేశపెడుతోంది. ఈ నేపథ్యంలో ఓరుగల్లు అభివృద్ధి కోసం పార్టీలు ఏ విధంగా పాటుపడతాయన్న చర్చ ఎన్నికల ఫలితాలు వెలువడిన మరుసటి రోజే మొదలైంది. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మల సీతారామన్ బడ్జెట్‌లో ఉమ్మడి వరంగల్‌కు ఏ మేరకు ప్రయోజనం కలుగుతుందన్న చర్చ సర్వత్రా సాగుతోంది.

ఆశించేవీ ఎన్నో.. అవకాశం ఎన్నింటికో..

- నరేంద్రమోదీ ఎన్నికల ప్రచారం సందర్భంగా మహబూబాబాద్ నుంచి విజయవాడకు, జనగామ నుంచి సికింద్రాబాద్ వరకు ఎంఎంటీఎస్ రైళ్లను ప్రవేశపెట్టాలన్న డిమాండ్ తెరపైకి వచ్చింది. అధికారంలోకి వచ్చాక సాధ్యాసాధ్యాలను పరిశీలించి అమలు చేస్తామన్న హామీ ఇచ్చారు. దీంతో ఈ రెండు ప్రాంతాలకు ఎంఎంటీఎస్ రైళ్లను ప్రవేశపెట్టాలని కోరుతున్నారు.
- డోర్నకల్ రైల్వే జంక్షన్ నుంచి కొవ్వూరు రైల్వేలైన్ పూర్తి చేసి, ఖమ్మం – భద్రాచలం రోడ్ – డోర్నకల్‌కు లైన్ల అనుసంధానం చేయాలంటున్నారు.
- కాజీపేట నుంచి ఉత్తర భారతదేశంలోని ఢిల్లీ, దక్షిణంలోని చెన్నై, పడమరలోని ముంబయి, తూర్పులోని విశాఖపట్నాలకు వెళ్లడానికి ఇతర స్టేషన్ల నుంచి వచ్చే రైళ్ల మీదే ఆధార పడాల్సి వస్తోంది. గతంలో ఈస్టర్న్ రైల్వే కాజీపేట నుంచి ముంబయికి ఆనంద్‌వన్, తడోబా ఎక్స్‌ప్రెస్‌లను నడిపింది. కరోనా సమయంలో రద్దయిన వీటిని ఇప్పటికీ పునరుద్ధరించలేదు. ప్రస్తుతం కాజీపేట నుంచి పుణె, హడప్సర్ (ముంబయి) వారాంతపు రైళ్లు మాత్రమే నడుస్తున్నాయి.
- ఆధ్యాత్మిక కేంద్రాలైన తిరుపతి, వారణాసి, షిర్డీకి ప్రతీరోజు వందల మంది కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, జనగామ రైల్వే స్టేషన్ల మీదుగా వెళ్తుంటారు. వీరికి ఇతర ప్రాంతాల నుంచి వచ్చే రైళ్లే ఆధారంగా ఉన్నాయి.

ఎంపీల ప్రతిపాదనలేమిటంటే..

- మేడారం సమక్క– సారలమ్మ జాతరలకు జాతీయ హోదా కల్పించడంతో పాటు బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, స్మార్ట్‌సిటీ, హృదయ్‌లకు భారీగా నిధులు కావాలని పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, కడియం కావ్యలు ప్రతిపాదించారు. వీటన్నింటిని సమీక్షించి కాజీపేటకు రైల్వే డివిజన్ హోదా కల్పించాలని కోరినట్లు వరంగల్, మహబూబాబాద్ ఎంపీలు కడియం కావ్య, పోరిక బలరాం నాయక్‌లు చెప్పారు.
- ధర్మసాగర్ మండలం ఎలకుర్తిలో సైనిక్ స్కూల్ స్థాపన, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు అభివృద్ధిలను ప్రస్తావించారు.

తెరమీదకు అనేక డిమాండ్లు..

కాజీపేట రైల్వే జంక్షన్‌కు డివిజన్ హోదా కలగానే మిగులుతోంది. డివిజన్ హోదా కల్పిస్తే ఇక్కడినుంచే రైళ్లను ప్రారంభించడానికి అవకాశం ఉంటుంది.

- కొత్తగా ఏర్పడిన గుంటూరు రైల్వే డివిజన్ నుంచి ఢిల్లీ, విశాఖ, ముంబయి, షిర్డీ లాంటి ప్రాంతాలను కలుపుతూ రైళ్లు నడుస్తున్నాయి. ఆ అవకాశం కాజీపేట నుంచి లేకుండా పోయింది.
- గోవాకు వెళ్లేవారు సికింద్రాబాద్‌కు వెళ్లి, అక్కడినుంచి అజంతా ఎక్స్‌ప్రెస్ లేదా ఇతర రైళ్లను ఆశ్రయిస్తున్నారు. కశ్మీరు, కేరళ, కన్యాకుమారి తదితర పర్యాటక ప్రాంతాలకు వారాంతపు రైళ్లు మాత్రమే.. అవి కూడా వరంగల్ మీదుగా ఉన్నాయి.
- గ్రేటర్ వరంగల్‌కు 2016 మే నాలుగో వారంలో సప్లిమెంటరీ పోటీల్లో 'స్మార్ట్‌సిటీ'లో చోటు లభించగా.. రూ.2 వేల కోట్లకు గాపైగా అభివృద్ధి పనుల ప్రతిపాదనలున్నా ఆ మేరకు నిధులు కేంద్రం కేటాయించలేదు. స్మార్ట్‌సిటీ, హృదయ్ కింద వరంగల్ నగర అభివృద్ధికి అత్యధికంగా నిధులు ఇవ్వాలని ఓరుగల్లు వాసులు కోరుతున్నారు.

మరమ్మతులు పూర్తి చేయండి

- జిల్లా కలెక్టర్ ప్రావీణ్య
- పరకాల చలివాగు, కంఠాత్మకూర్ కాజ్‌వేల పరిశీలన



కంఠాత్మకూర్ కాజ్ వేను పరిశీలిస్తున్న కలెక్టర్

ఆత్మకూర్/హనుమకొండ (పరకాల): వర్షాలతో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. వర్షాకాలం నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఉంటూ విధులు నిర్వహించాలని సూచించారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పరకాల చలివాగు ప్రవాహాన్ని, నడికూడ మండలం కంఠాత్మకూర్ కాజ్‌వేను కలెక్టర్ సోమవారం పరిశీలించారు.

చలివాగు వంతెన సైడ్ బర్మ్ కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారడంతో తక్షణమే మరమతులు చేయాలని నేషనల్ హైవే అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు పొంచి ఉన్న దృష్ట్యా మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీ పరిధిల్లో పారిశుద్ధ్య పనులు ఎప్పటికప్పుడు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లు మరమ్మతు చేసే సమయంలో వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. కంఠాత్మకూర్ వద్ద ఉన్న వాగులోనుంచి వరద ఉధృతంగా ప్రవహిస్తుండడంతో దెబ్బతిన్న కాజ్‌వే వద్ద వంతెన రోడ్డు నిర్మాణానికి సంబంధించిన వివరాలను ఆర్అండ్‌బీ ఈఈ సురేష్‌బాబు, రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మార్గంలో రాకపోకలు లేకుండా బోర్డులు ఏర్పాటు చేయాలని, అవసరమైతే సిబ్బందిని కాపలా ఉంచాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో పరకాల ఆర్డీఓ డాక్టర్ కె.నారాయణ, పరకాల మున్సిపల్ కమిషనర్ కె.నర్సింహ, తహసీల్దార్లు భాస్కర్, నాగరాజు, ఆర్అండ్‌బీ డీఈ ఎండీ గౌస్, ఇరిగేషన్ డీఈ శ్రీనివాస్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



పరకాల చలివాగు ప్రవాహాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, అధికారులు

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ పి.ప్రావీణ్య

హన్మకొండ: భారీ వర్షాలు కురుస్తున్నందున జిల్లాలోని అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి వివిధ శాఖల అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాభావ పరిస్థితులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్ష ప్రభావిత ప్రాంతాలను పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. భారీ వర్షాలతో వరద ఉధృతి కారణంగా చెరువులు, కుంటల్లోకి వరద నీరు చేరుతుందని, సాగునీటి పారుదల శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయకట్టు కింద పొలాలకు నష్టం వాటిల్లకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలన్నారు. చెరువు కట్టలు తెగే అవకాశాలున్న ప్రాంతాలను గుర్తించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జాతీయ రహదారులపై ఉన్న వంతెనలకు అవసరమైతే వెంటనే మరమ్మతులు చేపట్టాలని జాతీయ రహదారుల అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీరమాకాంత్‌ను ఆదేశించారు. వర్షాకాలం నేపథ్యంలో దోమలు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. తాగునీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. శిథిలావస్థకు చేరిన ఇళ్లల్లో ఎవరూ ఉండకూడదని, శిథిల భవనాల్లో ఉంటున్న వారిని సురక్షిత ప్రాంతాలకు, వారి బంధువుల ఇళ్లకు తరలివెళ్లేలా చూడాలన్నారు. వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న నేపథ్యంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, వైద్యులు, సిబ్బంది 24 గంటల పాటు అప్రమత్తంగా ఉండాలన్నారు. జ్వర బాధితులకు వైద్య సేవలు అందించే విధంగా ఆశ కార్యకర్తలతో గ్రామాల్లో ఇంటింటికి తిరిగి సర్వే చేయించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ఆ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. రెవెన్యూ, సాగునీటిపారుదల, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్యశాఖ, విద్యుత్ శాఖల అధికారులు, సిబ్బంది 24 గంటల పాటు విధుల్లో అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు.

చివరి వరకు నీరందేలా చూడాలి



అలుగు పోస్తున్న చలివాగు

- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు
- ఆయకట్టుకు చలివాగు నీటి విడుదల

శాయంపేట : సాగునీటిని అధికారులు వృథా చేయకుండా చివరి వరకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. సోమవారం జోగంపల్లి శివారులోని మధ్యతరహా చలివాగు ప్రాజెక్టునుంచి సోమవారం ఎమ్మెల్యే నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలివాగు ప్రాజెక్టు మరమ్మతుల కోసం యాసంగి సీజన్‌లో రైతులు క్రాప్ హాలిడే ప్రకటించినా కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల మొదటి దశలో కొద్ది మేరకే సిమెంట్ లైనింగ్ పనులు పూర్తయ్యాయని తెలిపారు. మొదటి పంట పూర్తయ్యాక అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు మిగులు పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం విడుదల చేసిన సాగునీటితో నాట్లు వేసుకొని పంటలు పండించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహిస్తే అతన్ని మార్చి డబ్బులు దుర్వినియోగం కాకుండా సిమెంట్ లైనింగ్ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఐబీ ఈఈ వెంకటేశ్వర్లు, డీఈ గిరిధర్, ఏఈ అమృత్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, పరకాల ఏఎంసీ మాజీ చైర్మన్ పోలేపల్లి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు చిందం రవి, అబ్బు ప్రకాశ్ రెడ్డి, కృష్ణమూర్తి, రఘుపతి రెడ్డి, రవీందర్, ఈశ్వర్, కుమారస్వామి, ప్రభాకర్, కట్టయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.



చలివాగు నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, అధికారులు

18ఫీట్ల నీటిమట్టం చేరిన చలివాగు

చలివాగు ప్రాజెక్టుకు ఎగువనుంచి వచ్చిన వరదతో నిండుకుండలా మారింది. సోమవారం 18ఫీట్ల నీటి మట్టానికి చేరుకొని అలుగు పోస్తోంది. ప్రాజెక్టులోకి భారీగా నీరు చేరడంతో వానాకాలం, ఎండాకాలం సీజన్‌కు సాగునీటి సమస్య తలెత్తదని ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చలివాగులో సమృద్ధిగా నీరు ఉంటే శాయంపేట, పరకాల, రేగొండ, చిట్యాల మండలాలకు సాగునీటితోపాటు, శాయంపేట, పరకాల మండలాలకు మిషన్ భగీరథలో తాగునీరు అందిస్తుంది.

జోరుగా.. వరిసాగు

హన్మకొండ : నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో జిల్లాలో వరి సాగు పనులు జోరందుకున్నాయి. ఇప్పటికే నారు పోసుకున్న రైతులు పొలం దున్ని నాట్లు వేస్తున్నారు. మిగతా రైతులు తమ పొలాలను దమ్ము చేస్తున్నారు. అసలు నారు పోసుకోని రైతులు స్వల్ప కాలిక వంగడాలను మాత్రమే సాగు చేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పంటలు కలిపి సాధారణ సాగు 2,43,644 ఎకరాలు ఉంటే ప్రస్తుతం 2,40,220 ఎకరాల్లో సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇప్పటి వరకు 86,962 ఎకరాల్లో పంటలు సాగు చేశారు. వరి సాగు విస్తీర్ణం 1,30,043 ఎకరాలు కాగా గతేడాది వానాకాలంలో 1,45,943 ఎకరాల్లో సాగు చేశారు. ప్రస్తుత వానాకాలంలో 1,48,400 ఎకరాల్లో సాగు చేస్తారని అంచనా వేయగా ఇప్పటి వరకు 2,423 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు.

కుంటలు, చెరువుల్లోకి చేరుతున్న నీరు..

మూడ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటల్లోకి వరద నీరు చేరుతుండడంతో రైతుల్లో సాగుపై ఆశలు పెరిగాయి. దీంతో వరి సాగు పనులు ముమ్మరం చేస్తున్నారు. అదే విధంగా మెట్ట పంటలు సాగుచేస్తున్న రైతులు పైపాటిగా కాంప్లెక్స్ ఎరువులు వేస్తున్నారు. దీంతో రైతులు ఓ వైపు వరి పొలాలు సిద్ధం చేసుకుంటునే మరోవైపు మెట్ట పంటలకు ఎరువులు వేస్తూ వ్యవసాయ పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. మొక్కజొన్న సాధారణ సాగు 9,188 ఎకరాలు కాగా ఈ వానాకాలంలో ఇప్పటి వరకు 2,672 ఎకరాల్లో సాగు చేశారు. పత్తి విస్తీర్ణం 1,00,350 ఎకరాలు కాగా, ప్రస్తుతం 75,724 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. పప్పు దినుసుల సాధారణ విస్తీర్ణం 2,547 ఎకరాలు కాగా ఇప్పటి వరకు 258 ఎకరాల్లో సాగైంది. నూనె గింజల పంటల విస్తీర్ణం 383 ఎకరాలు కాగా ఇప్పటి వరకు 113 ఎకరాల్లో సాగు చేస్తున్నారు.



శాయంపేటలో వరినాటు వేస్తున్న మహిళలు

నమోదైన వర్షపాతం..

ఈ నెల 19న జిల్లాలో సగటున 23.5 మిల్లీ మీటర్లు, 20న 16.3 మి.మీ, 21న 55.7 మి.మీ, 22న 53.4 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలో ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు కురిసిన వర్షాపాతం వివరాలను వాతావరణ శాఖ విడుదల చేసింది. జిల్లాలో సగటున 53.4 మిల్లీ మీటర్ల వర్షాపాతం నమోదైంది. అత్యధికంగా శాయంపేటలో 82.3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా, పరకాలలో 78.2, కమలాపూర్‌లో 73.8, నడికూడలో 64.3, ఎల్కతుర్తిలో 59.1, హసన్‌పర్తిలో 54.7, దామెరలో 54.6, ఆత్మకూర్‌లో 52.2, భీమదేవరపల్లిలో 50.4, ధర్మసాగర్‌లో 43, కాజీపేటలో 42.3, వేలేరులో 35.3, హనుమకొండలో 35.2, ఐనవోలులో 22.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

వచ్చే ఏడాదిలోగా ముంపు ముప్పు లేకుండా చేస్తా

పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హన్మకొండ చౌరస్తా: వచ్చే ఏడాది వర్షాకాలం లోగా నియోజకవర్గంలో ముంపు ముప్పు లేకుండా శాశ్వత చర్యలు చేపడుతామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, నగర మేయర్ సుధారాణితో కలిసి ఆయన సోమవారం సాయంత్రం 4వ డివిజన్‌లోని అక్షరకాలనీ, లోటస్‌కాలనీ, పెద్దమ్మగడ్డ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది వరద ఉధృతితో ప్రజలు ఇబ్బందులు పడినప్పటికీ అప్పటి సర్కార్ కనీస చర్యలు తీసుకోలేదన్నారు. త్వరలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ముంపు ప్రాంతాల అభివృద్ధికి కావాల్సిన నిధులను ప్రభుత్వాన్ని కోరుతానని తెలిపారు.

ఆశ కార్యకర్తలకు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశ కార్యకర్తలు

హన్మకొండ: ఆశ కార్యకర్తలకు ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని సీఐటీయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు హనుమకొండ కలెక్టరేట్ ఎదుట తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గిరిజన ప్రాంతాల్లో 33 ఏళ్లుగా, మైదాన ప్రాంతాల్లో 19ఏళ్లుగా ఆశ వర్కర్లు పనిచేస్తున్నారని వివరించారు. ఇప్పటి వరకు వారు అనేక శిక్షణలు పొందారని, రిజిస్టర్లు రాయడం, సర్వేలు చేయడం, ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయడం, బీపీ, షుగర్, థైరాయిడ్, వివిధ రకాల జబ్బులను గుర్తించడం వంటి విధులు నిర్వహిస్తున్నారని వివరించారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న మందులను ప్రజలకు అందిస్తున్నారని పేర్కొన్నారు. ఈనెల 30వ తేదీన చేపట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. ధర్నాలో యూనియన్ నాయకులు రాజేశ్వరి, పద్మ, శోభ, పుతిలి, సరిత, నవమని, రజిత, కె.కల్పన, శోభ, శ్రీవాణి, యాకూబీ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గురుకుల బాలుర ప్రతిభ కళాశాలల్లో అడ్మిషన్లు

విద్యారణ్యపురి: వరంగల్ యాకూబ్‌పూరాలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర ప్రతిభ కళాశాల, అలాగే సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ఎంపీసీ, బీపీసీ ప్రథమ సంవత్సరంలో పరిమితి సంఖ్యలో సీట్లు ఉన్నాయని వరంగల్, కరీంనగర్ ప్రాంతీయ సమన్వయ అధికారి తుమికి వెంకటేశ్వరరాజు ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల గిరిజన విద్యార్థులు తమ ఒరిజనల్ విద్యార్హతల సర్టిఫికెట్లతో సంబంధిత ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లను ఈనెల 26తేదీ లోపు కలిసి అడ్మిషన్లు పొందాలని ఆయన కోరారు.

వరంగల్ మార్కెట్ గ్రేడ్-2 కార్యదర్శిగా అంజిత్‌రావు



వరంగల్ : వరంగల్ వ్యవసాయ మార్కెట్ గ్రేడ్–2 కార్యదర్శిగా భువనగిరి అంజిత్‌రావు నియమితులయ్యారు. ఆయన భువనగిరి నుంచి వరంగల్‌కు బదిలీ అయ్యారు. అదేవిధంగా ఇటీవల వర్ధన్నపేట, నెక్కొండ, నర్సంపేట మార్కెట్లనుంచి బదిలీపై ఇక్కడికి వచ్చిన సూపర్‌వైజర్లు చక్రబహదూర్ రాయ్, అల్లి జ్యోతిప్రకాశ్, ఎండీ.సలీం, జేఎంఎస్ మేకల రజిత సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

ఏటీఎం దొంగల పట్టివేత

వరంగల్ క్రైం: ఇతర రాష్ట్రాలతో పాటు నగరంలోని ఏటీఎంల్లో చోరీకి పాల్పడుతున్న దొంగలను పట్టుకున్నట్లు హనుమకొండ సీఐ సతీశ్ ప్రకటనలో తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఫతేపూర్‌కు చెందిన శుభం, అతడి స్నేహితురాలు ప్రియాంకకు శివ్‌వీర్ సింగ్, అనిష్‌సింగ్, సత్యవీర్, సీసీఎల్, ప్రియాంక సింగ్ పరిచయమయ్యారు. వీరంతా బట్టల షాపుల్లో పనిచేస్తున్నారు. అయితే జీతం సరిపోకపోవడంతో శుభం సులభంగా డబ్బు సంపాదించాలని ఏటీఎంల్లో చోరీకి పాల్పడ్డాడు. ఇందులో భాగంగా నయీంనగర్ మెయిన్ రోడ్డులో ఉన్న కెనరా బ్యాంకు ఏటీఎంలో రూ.వేయి, ఎంజీఎం పక్కన ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలో రూ.10వేలు, హనుమకొండ లోకల్ బస్ డిపో దారిలో ఉన్న కెనరా బ్యాంకు ఏటీఎంలో రూ.6,500, సర్క్యూట్ గెస్ట్ హౌస్ ప్రాంతంలోని కెనరా బ్యాంకు ఏటీఎంలో రూ.2వేలు, బస్టాండ్ దారిలోని కెనరా బ్యాంకు ఏటీఎంలో రూ.5వేలు చోరీ చేశారు. సోమవారం ఉదయం హనుమకొండలోని కెనరా బ్యాంకు ఏటీఎం పగులగొట్టి డబ్బులు ఎత్తుకెళ్తున్నారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ముగ్గురిని పట్టుకుని వారి నుంచి డబ్బు, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుపడిన వారిలో శివవీర్‌సింగ్, అనిష్‌సింగ్, సీసీఎల్ ఉన్నారు. సత్యవీర్, ప్రియాంక సింగ్, శుభం, ప్రియాంక పరారీలో ఉన్నారని సీఐ సతీశ్ తెలిపారు.



కాళేశ్వరం పుష్కరఘాట్‌ను తాకుతూ ప్రవహిస్తున్న గోదావరి

కాళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ

- మేడిగడ్డకు 9,54,310 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- అన్నారం బరాజ్‌కు 19,600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

ప్రాణహిత ఉగ్రరూపం..

కాళేశ్వరం: మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రాణహిత నది ఉగ్రరూపం దాల్చింది. దీంతో కాళేశ్వరం వద్ద గోదావరిలో కలిసి భీకరంగా ప్రవహిస్తోంది. సోమవారం జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం పుష్కరఘాట్‌పై నుంచి వరద నీరు 12.5 మీటర్ల ఎత్తులో దిగువకు తరలిపోతుంది. దీంతో సీడబ్ల్యూసీ అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఆ వరద ఉధృతి భారీగా పెరగడంతో మేడిగడ్డ బరాజ్ వద్ద 9,54,310 క్యూసెక్కులు తరలి వస్తుంది. బరాజ్‌లో మొత్తం 85గేట్లు ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు తరలిస్తున్నారు. అన్నారం(సరస్వతి)బరాజ్‌కు ఇన్‌ఫ్లో 19,600 క్యూసెక్కుల తరలిరాగా, వచ్చిన నీటిని వచ్చినట్లు మొత్తం బరాజ్‌లోని 66గేట్లు ఎత్తి నీటిని దిగువ కాళేశ్వరం వైపునకు తరలిస్తున్నారు.

23.2 ఫీట్లకు చేరిన పాకాల నీటిమట్టం



నిండుకుండలా పాకాల సరస్సు

ఖానాపురం: మండలంలోని పాకాల సరస్సు నీటిమట్టం సోమవారం సాయంత్రం నాటికి 23.2 ఫీట్లకు చేరింది. పూర్తి స్థాయి నీటి మట్టం 30.3 ఫీట్లు కాగా మరో 1. 10 ఫీట్ల నీరు చేరితే ఆయకట్టు పరిధిలో పంటలకు పూర్తి స్థాయిలో సరిపోనుంది. మరో 5.3 ఫీట్ల నీరు చేరితే మత్తడి పోస్తుంది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో సరస్సులో నీటి మట్టం పెరుగుతుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాగా, భారీ వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ కిరణ్‌కుమార్ సూచించారు. ఈ మేరకు పాకాల నీటి మట్టం, కట్టను సోమవారం పరిశీలించారు. మత్స్యకారులతోపాటు ఇతరులు చేపల వేటకు వెళ్లొద్దన్నారు.

అప్రమత్తతే ఆత్మరక్షణ

- అధికారులు, ప్రజలు జాగ్రత్తగా ఉండాలి
- రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క
- ఏజెన్సీలో పర్యటన



వరద ముంపు ప్రాంతాల నుంచి వచ్చిన గర్భిణులతో మాట్లాడుతున్న మంత్రి సీతక్క



వాజేడు: గోదావరి వరదను పరిశీలిస్తున్న మంత్రి

ఏటూరునాగారం/వాజేడు: వరద ముంపు ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తమను తాము రక్షించుకోవాలని, అధికారులు, వరద బాధితులు జాగ్రత్తగా ఉండాలని రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. సోమవారం ఏటూరునాగారం, వాజేడు మండలాల్లో పర్యటించారు. ముందు ఏటూరునాగారం మండలం ముళ్లకట్ట బ్రిడ్జి వద్ద గోదావరి నది, సామాజిక ఆస్పత్రిని పరిశీలించారు. సామాజిక ఆస్పత్రిలోని ఐసీయూ, ఇంటెన్సికేర్ యూనిట్‌లో వరద ముంపు ప్రాంతాల నుంచి వచ్చిన 12 మంది గర్భిణులతో మాట్లాడారు. వాజేడు, వెంకటాపురం(కె) తదితర ప్రాంతాల నుంచి వచ్చిన గర్భిణులకు బ్రెడ్లు పంపిణీ చేశారు. ఆస్పత్రిలో సేవలు ఎలా అందుతున్నాయని, వైద్యులు నుంచి ఎలాంటి స్పందన వస్తుందని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ గోదావరి, వాగుల వల్ల ఇబ్బంది ఉన్న గ్రామాల్లోకి అధికారులు ఇప్పటి వరకు వెళ్లి అన్ని రకాల సేవలు అందిస్తున్నారన్నారు. వరద పెరిగితే వెంటనే తరలించడానికి జిల్లాలో 135 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అనంతరం ముళ్లకట్ట బ్రిడ్జి వద్ద గోదావరి రెండు కిలోమీటర్ల మేర ప్రవహిస్తుండడంతో ఆ ప్రవాహాన్ని పరిశీలించారు.

బొగతను సదర్శించిన మంత్రి సీతక్క..

వాజేడు మండల పరిధిలోని చీకుపల్లి వద్ద ఉన్న బొగత జలపాతాన్ని అధికారులతో కలిసి మంత్రి సీతక్క సందర్శించారు. జలపాతం వద్ద ఇందిరా క్రాంతి మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభించిన అనంతరం ఆమె అధికారులతో కలిసి జలపాతం చూశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా శక్తివంతులను చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారని తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు ఈ క్యాంటీన్‌లో తింటే అమ్మ గుర్తుకువస్తుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ములుగు కలెక్టర్ దివాకర్ టీఎస్, ఎస్పీ శబరీష్, డీఎఫ్‌ఓ రాహుల్ కిషన్ జాదవ్, అడిషనల్ కలెక్టర్ శ్రీజ, డీఎంహెచ్‌ఓ అప్పయ్య, ఓఎస్‌డీ మహేష్ బాబా సాహెబ్, ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, మండల అధ్యక్షుడు చిటమట రఘు తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ కలెక్టరేట్‌లో కంపు కంపు

- పారిశుద్ధ్య లోపంతో ప్రజల ఇబ్బందులు



పాత సామగ్రిని పట్టుకుపోతున్న గుర్తు తెలియని వ్యక్తి



మరుగుదొడ్ల ఎదుట నిలిచిన నీరు

కాశీబుగ్గ సెంటర్: వరంగల్ కలెక్టరేట్ ఆవరణలో పారిశుద్ధ్య లోపం కనబడుతుంది. కలెక్టరేట్ ప్రధాన భవనం ఎదుట నామమాత్రంగానే శుభ్రం చేసి మిగతా పరిసర ప్రాంతాలు చెత్తాచెదారంతో దర్శనమిస్తుంది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి ప్రధాన గేటు ఎదుట చెరువును తలపించే విధంగా నీళ్ల నిలిచినా పట్టించుకునే నాథుడే లేడు. సోమవారం ప్రజావాణి సందర్భంగా కలెక్టరేట్‌కు వచ్చే ఫిర్యాదుదారులు నిలిచిన నీటితో ఇబ్బందులు పడ్డారు. అలాగే భవనం వెనుకభాగంలో ఉన్న మరుగుదొడ్ల చుట్టూ నీరు నిలవడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇక కలెక్టరేట్ ప్రాంగణం చుట్టూ గడ్డి, పిచ్చి మొక్కలు అడవిని తలపిస్తున్నాయి. అలాగే కలెక్టరేట్ భవనం వెనక భాగంలో ఉన్న పాత సామగ్రిని గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించుకుపోతున్నారు. విశ్రాంతి ప్రాంగణం వెనకాల నుంచి గోడ అవతలికి పడేసి పట్టుకుపోతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి




రమేశ్(ఫైల్)

ఎల్కతుర్తి: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన సోమవారం భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి శివారులో చోటు చేసుకుంది. ముల్కనూర్ ఎస్సై సాయిబాబు కథనం ప్రకారం..గట్లనర్సింగాపూర్‌కు చెందిన చల్లూరి రమేశ్(50) హసన్‌పర్తి మండలం ఎస్సార్ యూనివర్సిటీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. పని నిమిత్తం ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో కొత్తపల్లి శివారులో ఎల్కతుర్తి, ముల్కనూర్ ప్రధాన రహదారిపై ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య వసంత, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయిబాబు తెలిపారు.

తెలంగాణ అంటేనే దాశరథి..



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్





మాట్లాడుతున్న సిధారెడ్డి, దేశపతి శ్రీనివాస్

- జైలులో కూడా ఉద్యమాలు చేసేవారు
- దాశరథి శతజయంతి ఉత్సవాల్లో వక్తలు

మహబూబాబాద్/చిన్నగూడూరు: తెలంగాణ అంటేనే దాశరథి.. దాశరథి అంటేనే తెలంగాణ అని పలువురు వక్తలు కొనియాడారు. దాశరథి కృష్ణమాచార్య శత జయంతి ఉత్సవాల ప్రారంభ వేడుకల్లో భాగంగా సోమవారం దాశరథి పుట్టిన గ్రామం చిన్నగూడూరు మండల కేంద్రంలో ఆయన విగ్రహానికి ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే రాంచంద్రునాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్, తెలుగు సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షుడు నందిని సిధారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చిన్నగూడూరు, మహబూబాబాద్‌లో సభలు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు అధ్యక్షతన మహబూబాబాద్‌లోని ఎస్వీఎం ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సభలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడారు. నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా దాశరథి తన ప్రాణాలను పణంగా పెట్టి ఉద్యమించారన్నారు. జైలులో కూడా ఉద్యమాలు చేసిన వ్యక్తి దాశరథి అన్నారు. దాశరథి జీవిత చరిత్రను భావితరాలకు తెలపాలన్నారు. చిన్నగూడూరుకు దాశరథి చిన్నగూడూరు అని నామకరణం చేయాలని కోరారు. అనంతరం డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ మాట్లాడుతూ అక్షరమే అగ్నిధారగా, పద్యమే పదునైన ఆయుధంగా మలిచి ప్రజలను మేల్కొలిపిన మహనీయుడు దాశరథి అన్నారు. దాశరథి సత్య, నిత్య అన్వేషి అన్నారు. ప్రజల కోసం పరితపించిన గొప్ప వ్యక్తి దాశరథి అని, ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. తెలుగు సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షుడు నందిని సిధారెడ్డి మాట్లాడుతూ దాశరథి పద్యాలను గుర్తుపెట్టుకుని ఆయనను స్మరించుకోవాలన్నారు. ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు మాట్లాడుతూ దాశరథి గురించి భావితరాలకు తెలిసేలా పలు కార్యక్రమాలు చేయాలన్నారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ)రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ, టీఎన్జీఓఎస్ పూర్వ అధ్యక్షుడు దేవీ ప్రసాద్, మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, గునిగంటి కమలాకర్, వెంకటేశ్వర్లు, అడ్డగోడ రాజేశ్, బానోత్ రవికుమార్, ఎడ్ల వేణుమాధవ్, జె. వెంకన్న, శంకర్ గౌడ్, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ నాగవాణి పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులు త్వరితగతిన పరిష్కరించాలి



దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న వరంగల్ కలెక్టర్ సత్యశారద



హనుమకొండ కలెక్టరేట్‌లో ప్రజలనుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు

హన్మకొండ: ప్రజావాణి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎ.వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. అదనపు కలెక్టర్ ఎ.వెంకట్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వై.వి.గణేష్, హనుమకొండ ఆర్డీఓ వెంకటేష్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 142 వినతి పత్రాలు అందజేశారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ సమస్యలపై 27 వినతి పత్రాలు, సర్వే ల్యాండ్ రికార్డ్స్, జిల్లా వ్యవసాయాధికారి, జిల్లా సివిల్ సప్‌లై ఆఫీసర్, జిల్లా సహకార అధికారి, జిల్లా రిజిస్ట్రార్, లీడ్ బ్యాంక్ ఆఫీసర్, ఎంపీడీఓ ఆత్మకూర్, ఎంపీడీఓ దామెర, ఎంపీడీఓ ధర్మాసాగర్, ఎంపీడీఓ ఎల్కతుర్తి, ఎంపీడీఓ ఐనవోలు, ఎంపీడీఓ పరకాల, పరకాల తహసీల్దార్‌కు ఒక్కో వినతి పత్రం వచ్చాయి. ఐనవోలు తహసీల్దార్‌కు 14, హసన్‌పర్తికి 12, ఆర్డీఓ పరకాలకు 6, ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు 4, భీమదేవరపల్లి, ధర్మసాగర్ తహసీల్దార్‌కు 5, జిల్లా విద్యాశాఖాధికారికి 4 ఫిర్యాదులతోపాటు మరికొన్ని కార్యాలయంలో ఒక్కటి, రెండు చొప్పున వచ్చాయి. వీటిని ఆయా విభాగాలకు పంపించి పరిష్కరించేలా చూడాలని ఆదేశించారు.

వరంగల్ ప్రజావాణిలో 123 అర్జీలు

కాశీబుగ్గ సెంటర్: ప్రజావాణి దరఖాస్తులు సకాలంలో పరిష్కరించాలని వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జెడ్పీ సీఈఓ రామిరెడ్డి, డీఆర్‌డీఓ కౌసల్యాదేవి, ఇతర శాఖల అధికారులతో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. శాఖల వారీగా లీడ్ బ్యాంక్ 6, పంచాయతీ శాఖ 8, గ్రామీణ అభివృద్ధి శాఖ 8, స్త్రీ శిశు సంక్షేమ శాఖ 3, రెవెన్యూ శాఖ 74, ఇతర శాఖలకు చెందినవి 24 (మొత్తం 123) దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రీవెన్స్‌లో వచ్చిన దరఖాస్తులను ఆయా శాఖల అధికారులు సత్వరమే పరిష్కరించాలన్నారు.

క్రమశిక్షణతోనే ఉన్నత శిఖరాలు


- ఎస్సార్ యూనివర్సిటీ చాన్స్‌లర్ వరదారెడ్డి



మాట్లాడుతున్న వరదారెడ్డి

హసన్‌పర్తి: క్రమశిక్షణ, కఠోర శ్రమతోనే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని ఎస్సార్ చాన్స్‌లర్ ఎ.వరదారెడ్డి అన్నారు. బీటెక్, బీబీఎం, బీఎస్సీ(అగ్రికల్చర్) మొదటి సంవత్సరం ప్రవేశం పొందిన విద్యార్థులకు సోమవారం ఓరియంటేషన్ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ యూవర్సిటీల్లో అధునాతన సదుపాయాలు ఉన్నాయన్నారు. ఉత్తమ కరిక్యులం, పరిశ్రమ అవసరాలను అందులో పొందపర్చామన్నారు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకుల్లో జాతీయ స్థాయి యూనివర్సిటీకి 98వ ర్యాంకు దక్కిందన్నారు. నాణ్యమైన విద్యతోనే ఇది సాధ్యమైందని చెప్పారు. ఎస్సార్ వర్సిటీ వైస్ చాన్స్‌లర్ దీపక్ గార్గ్ మాట్లాడుతూ విదేశీ వర్సిటీలతో తమ యూనివర్సిటీ ఒప్పందాలు కుదుర్చుకుందన్నారు. దీని ద్వారా కరిక్యులం, డిజైనింగ్, విదేశాల్లో ఉన్నత విద్యకు అనుకూలంగా ఉంటోందన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రిజిస్ట్రార్ అర్చనారెడ్డి, డీన్ డాక్టర్ మహేశ్, డాక్టర్ విజయ్‌కుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ప్రజాపాలన సేవా కేంద్రం



ప్రజా పాలన సేవా కేంద్రంలో బారులుదీరిన లబ్ధిదారులు

హన్మకొండ : గృహజ్యోతి, మహాలక్ష్మి పథకం, రూ.500లకే గ్యాస్ పొందలేక పోతున్న అర్హులైన లబ్ధిదారుల వివరాల సవరణకు సోమవారం హనుమకొండ కలెక్టరేట్‌లో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని జిల్లా అధికారులు ఏర్పాటు చేశారు. గతంలో ప్రజాపాలన దరఖాస్తు చేసుకున్న వారు పొరపాట్ల సవరణకు ప్రభుత్వం అవకాశాన్ని కల్పించింది. ప్రజావాణి సైతం సోమవారమే ఉండడంతో ప్రజాపాలన సేవ కేంద్రం వద్ద మొదటి రోజే అధిక సంఖ్యలో లబ్ధిదారులు తమ వివరాలు అప్‌డేట్ చేయించుకున్నారు. ప్రతి రోజు ఈ కేంద్రం పని చేస్తోందని అధికార వర్గాలు తెలిపాయి. ప్రజాపాలనలో దరఖాస్తు చేసి గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలు అందుకోలేక పోతున్న అర్హులు ఈ సేవా కేంద్రం ద్వారా తమ సమస్యను పరిష్కరించుకోవాలని తెలియజేశారు.

నేటినుంచి రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్: ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి 26వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి అండర్–17 బాలబాలికల షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ డాక్టర్ పింగిళి రమేశ్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ సుబేదారిలోని వరంగల్ క్లబ్, భీమారంలోని కిట్స్ కళాశాల ఇండోర్ స్టేడియంలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు కేరళలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. నాలుగు రోజులు జరగనున్న చాంపియన్‌షిప్‌కు వివిధ జిల్లాల నుంచి 250 మంది క్రీడాకారులు పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. 24న జరిగే పోటీల ప్రారంభోత్సవానికి అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కిడాంబి నందగోపాల్, విద్యాదర్ హాజరవుతున్నట్లు తెలిపారు. 26న ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా సీపీ, విశిష్ట అతిథిగా క్లబ్ సెక్రటరీ రవీందర్‌రెడ్డి హాజరై విజేతలకు పతకాలు అందజేస్తారని తెలిపారు.

28 నుంచి దూరవిద్య పీజీ తరగతులు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని దూరవిద్య కేంద్రం పీజీ కోర్సుల తరగతులు ఈనెల 28 నుంచి నిర్వహించనున్నట్లు ఎస్‌డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.రాంచంద్రం సోమవారం ప్రకటనలో తెలిపారు. ఎంఏ, ఎంకాం ప్రథమ సెమిస్టర్ విద్యార్థులకు, ఇయర్ వైజ్ స్కీంలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు కాంటాక్ట్ తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంఏ (పొలిటికల్ సైన్స్), ఇంగ్లిష్, సోషియాలజీ, ఎంకాంతరగతులు దూరవిద్య కేంద్రంలోనే ఉంటాయని వెల్లడించారు.

జఫర్‌గఢ్ ఎస్సై రవియాదవ్ సస్పెండ్



వరంగల్ క్రైం: జఫర్‌గఢ్ ఎస్సై రవియాదవ్‌ను సస్పెండ్ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గత ఏడాది స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులకు సంబంధించి అలసత్వంగా వ్యవహరిస్తూ.. విచారణ విషయంలో పోలీస్ ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టిస్తూ.. బాధితులకు న్యాయం చేయకుండా నిందితులకు సహకరిస్తున్నట్లు అభియోగాలు వచ్చాయి. పలు కేసుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు అధికారులు విచారణ చేపట్టారు. ఎస్సై రవియాదవ్ అవకతవకలకు పాల్పడినట్లు నిర్ధారణ కావడంతో సస్పెండ్ చేస్తూ సీపీ ఉత్తర్వులు ఇచ్చారు.

గంజాయిపై ఉక్కుపాదం మోపాలి

- కేసుల దర్యాప్తులో పురోగతి సాధించాలి
- నేర సమీక్షలో సీపీ అంబర్ కిషోర్ ఝా



మాట్లాడుతున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం : కమిషనరేట్ పరిధిలో గంజాయి వినియోగాన్ని ఉక్కుపాదంతో అణిచి వేయాలని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధికారులకు సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో అర్ధసంవత్సర నేర సమీక్ష సమావేశాన్ని సోమవారం కమిషనరేట్ కార్యాలయములో నిర్వహించారు. ముందుగా పెండింగ్‌లో ఉన్న ప్రధాన కేసుల దర్యాప్తు, వాటి పురోగతి, కేసుల్లోని నిందితుల అరెస్టులో ఆలస్యానికి గల ప్రధాన కారణాలపై స్టేషన్ల వారీగా పోలీస్ అధికారులతో సీపీ సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులకు సూచనలు, సలహాలిస్తూ కేసుల దర్యాప్తు విషయంలో అధికారులు ప్రస్తుతం అందుబాటులో ఉన్న టెక్నాలజీతో పాటు, శాస్త్రీయ పద్ధతిను కూడా అనుసరించాలన్నారు. దర్యాప్తులో బాధితులకు వీలైనంత వరకు న్యాయం చేయాలని, పోలీస్ అధికారుల పని తీరుపైనే కమిషనరేట్ కీర్తి ప్రతిష్టలు ఆధారపడి ఉంటాయని సీపీ తెలిపారు. అనంతరం శాంతిభద్రతల అంశాలపై సీపీ మాట్లాడుతూ రౌడీ షీటర్ల పట్ల కఠినంగా వ్యవహరించడంతో పాటు వారిపై నిరంతరం నిఘా పెట్టాలని, బాలికలు, మహిళల మిస్సింగ్, అపహరణ కేసుల్లో అలసత్వం వహించకుండా సత్వరమే చర్యలు తీసుకోవాలన్నారు. కమిషనరేట్ పరిధిలో నిరంతరం కార్డన్ సెర్చ్ నిర్వహించాలని, అలాగే రోడ్డు ప్రమాదాల నివారణకు రోడ్డు సెఫ్టీ విభాగంతో కలిసి పనిచేయాలని అన్నారు. ప్రధానంగా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ముమ్మరంగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీ చేపట్టాలని, అలాగే ట్రిపుల్–సీ విభాగం నుంచి వచ్చే ఫిర్యాదులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారనే దానిపై ఎప్పటికప్పుడు అధికారులు ఉత్తర ప్రత్యుత్తరాలు జరపాలని పోలీస్ కమిషనర్ తెలియజేశారు. సమావేశంలో డీసీపీలు షేక్ సలీమా, రాజమహేంద్ర నాయక్, అదనపు డీసీపీలు రవి, సంజీవ్, సురేష్ కుమార్, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన పోలీస్ అధికారులు